# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-09-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం విడుదల చేస్తారు.**

2. **నరసాపురం పార్లమెంట్ పరిధిలోని జాతీయ రహదారి తొలి దశ పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు.**

3. **పోలవరం జిల్లా గొల్లగుప్పలో అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు.**

4. **రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థల్లో ఆధునిక చెత్త సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు.**

==========================

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం విడుదల చేస్తారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద రెగ్యులేటర్‌ను ఆన్ చేసి, గోదావరి జలాలకు జలహారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్..30 సెకన్లు

--------------------------

అన్ని రంగాల్లో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే జలాలను మళ్లించి ఉత్తరాంధ్రకు అందిస్తున్నామని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు తెలిపారు. ఇందులో భాగంగా పోలవరం ఎడమ కాల్వ ద్వారా వచ్చే గోదావరి జలాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ఎడమ కాల్వ ప్రారంభం ఉత్తరాంధ్ర రైతుల అభివృద్ధికి ఆరంభమని లోకేశ్ పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సమగ్ర, సర్వతోముఖ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

--------------------------

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ పరిధిలో భీమవరం-లోసరి జాతీయ రహదారి అభివృద్ధికి 43 కోట్ల నిధులతో తొలి దశ పనులకు ఆమోదం లభించిందని కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, తీరప్రాంత అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర రహదారి మౌలిక సదుపాయాల నిధి-సీఆర్ఐఎఫ్ పథకం కింద గత ఏడాది -100 కోట్లు మంజూరైనట్లు - పేర్కొన్నారు. ఇందులో భాగంగా 15.53 కిలోమీటర్ల మేర భీమవరం-దొంగపిండి, గూట్లపాడు రేవు-బర్రెవానిపేట మధ్య నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నామని త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని శ్రీనివాస వర్మ వెల్లడించారు.

---------------------------

పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్పలో అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. గొల్లగుప్పలో తాజా పరిస్థితిపై జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ మంత్రికి ఫోన్ ద్వారా వివరించారు. మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన బాధితులను మరో 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

మరోవైపు గొల్లగుప్పలో అస్వస్థతకు గురై భద్రాచలం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ కె.దినేష్‌కుమార్ ఈరోజు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ పాత్రికేయులకు వెల్లడించారు.

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అసాంక్రమిక వ్యాధుల గుర్తింపు కోసం నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.0 కార్యక్రమంలో 66.05 శాతం మందికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడీ 4.0 సర్వేలో ఇప్పటివరకు 59.29 లక్షల అధిక రక్తపోటు, 48.15 లక్షల మధుమేహం కేసులు గుర్తించామని చెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా అనుమానితులుగా గుర్తించిన వారిలో తదుపరి పరీక్షల ద్వారా 2,026 నోటి, 3,571 రొమ్ము, 2 వేల 76 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు నిర్ధారణ అయ్యాయని వీరికి సకాలంలో చికిత్స అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఎన్‌సీడీ సర్వే త్వరలో పూర్తికానున్నందున, ఇంకా పరీక్షలు చేయించుకోని వారు చేయించుకోవాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

---------------------------

రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థల్లో ఆధునిక చెత్త సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. కర్నూలు నగరంలో కొత్త ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కర్నూలును పరిశుభ్రమైన, పచ్చదనం కలిగిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పాత చెత్త సేకరణ వాహనాల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. వీటితో పర్యావరణ పరిరక్షణతో పాటు చెత్త సేకరణ, తరలింపు

మరింత వేగంగా, సమర్థవంతంగా జరుగుతుందని మంత్రి పేర్కొంటూ

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

చేనేత సహకార సంఘాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత కార్మికుల సహకార సంఘం–ఆప్కో ద్వారా సకాలంలో చెల్లింపులు చేస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండేళ్లలో చేనేత వస్త్రాల కొనుగోళ్లకు సంబంధించి 24.51 కోట్ల రూపాయలను–చెల్లించినట్లు వెల్లడించారు. అలాగే వివిధ శాఖలు, గురుకులాలకు సరఫరా చేసిన చేనేత వస్త్రాలకు సంబంధించి 1.03 కోట్ల–బకాయిలను 20 సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని మిగిలిన బకాయిలను కూడా త్వరలో చెల్లిస్తామని తెలిపారు.చేనేత సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు చేనేతలకు నిరంతరం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ – ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఈరోజు దర్శించుకున్నారు. జీఎస్ఎల్వీ–ఎఫ్17 రాకెట్ నమూనాలను స్వామివారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వి. నారాయణన్ పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ నెల 4వ తేదీన తెల్లవారుజామున 2 గంటల 55 నిమిషాలకు ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రయోగించనున్నట్లు తెలిపారు. జీఎస్ఎల్వీ–ఎఫ్17 రాకెట్ ద్వారా అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు చెప్పారు. భూ పరిశీలన కోసం జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్–05 అని వివరించారు. అత్యాధునిక సాంకేతికతతో ఈ ఉపగ్రహం మరింత స్పష్టమైన చిత్రాలను అందించనుందని తెలిపారు.

---------------------------

విజయవాడలో అక్టోబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సరస్ మేళా ఏర్పాట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్‌తో కలిసి నిన్న పరిశీలించారు. పున్నమిఘాట్, భవానిపురంలోని ప్రతిపాదిత ప్రాంగణాన్ని సందర్శించి మేళాకు అవసరమైన మౌలిక వసతులు, ప్రజల రాకపోకలు, స్టాళ్ల ఏర్పాటుపై చర్చించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు నివాళులర్పించారు. వైయస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద విజయమ్మతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

---------------------------